ప్రజాశక్తి

గురువారం 29 ఆగస్టు 2024 5 అనంతపురం

విద్యుత్ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ ఛార్జీల పెంపు, వ్యవసాయ, గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లు తదితర వాటికి వ్యతిరేకంగా బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలియజేశారు. బషీర్‌బాగ్ కాల్పుల్లో వీరమరణం పొందిన విద్యుత్ అమరవీరుల దినోత్సవాన్ని సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో నీలిమ సర్కిల్ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అదానీ కంపెనీలకు ఊడిగం చేసే విధంగా జగన్మోహన్ రెడ్డి స్మార్ట్ మీటర్లను తీసుకొని వచ్చారన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ఒప్పందం చేసుకుని అన్నదాతల మెడకు ఉచ్చుబిగించే నిర్ణయం తీసుకున్నాడని విమర్శించారు. సర్‌ఛార్జీలు, అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపాడన్నారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో ఆయన్ను ఇంటికి సాగనంపారని తెలియజేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు ఈ విధానాలను వ్యతిరేకిస్తానని, రైతులకు బిగించే విద్యుత్ మీటర్లను తమ కార్యకర్తలు పగలగొట్టాలని పిలుపునిచ్చారన్నారు. అధికారంలోకి రాగానే ఇళ్లకు, ప్రభుత్వ ఆఫీసులకు స్మార్ట్ మీటర్ల పెట్టడానికి చంద్రబాబు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి రాకముందు విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు ఆ మాటను మర్చిపోవడం ప్రజలకు ద్రోహం చేయడమే అన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రాబోవు కాలంలో ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, మసూద్, రాజు, లక్ష్మీనారాయణ, నూరుల్లా, రామాంజినేయులు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శీన, నాగేంద్ర, పుల్లన్న, 50వ డివిజన్ పార్టీ నాయకులు ఫక్రు, మహేష్, మురళి, రాము మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు .

పన్ను పక్కదారి



పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు సంబంధించి వసూలు చేసిందెంత... నేరగా జేబుల్లోకెళ్లింది ఎంత అన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా పంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూళ్లలో ఈ వ్యవహారం జోరుగా నడిచిందన్న ఆరోపణలున్నాయి. అనంతపురం జిల్లాలో 577 పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో మొత్తం ఏడాది ఆస్తి పన్ను డిమాండ్ రూ.16 కోట్లకుపైగా ఉంది. ఇందులో ఏడాదికి సగటున యాభై శాతం వరకు పన్నులు అధికారికంగా వసూలు అవుతుండగా తక్కినవి బకాయిలుగా ఉంటున్నాయి. ఇందులోనూ చాలా వరకు వసూలై నేతల జేబుల్లోకి వెళ్లినట్టు ఆరోపణలున్నాయి.

- వసూలు చేసిందెంత... జేబుల్లోకి చేరిందెంత..!
- పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ఆరోపణలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను, ఇతర పన్నుల డిమాండ్ కలిపి మొత్తం రూ.16.1 కోటికాగా, అంతకు మునుపు బకాయి రూ.5.3 కోట్లు మొత్తం కలిపి 21.4 కోట్లు పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది. ఆ ఏడాది మొత్తం కలిపి వసూలైంది కేవలం రూ.11 కోట్లు మాత్రమే. అందులో పాత బకాయి రూ2.25 కోట్లు, ఆర్థిక సంవత్సరం వసూలైంది రూ.8.78 కోట్లు మొత్తం రూ.11 కోట్లు వసూలయ్యాయి. తక్కినవి రూ.10.4 కోట్లు బకాయిలుగా ఉండిపోయాయి. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో బకాయి రూ.10.9 కోట్లుకాగా, రూ.16.7 కోట్లు కలిపి మొత్తం రూ.27.6 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా జులై ఆఖరు వరకు రూ.2.13 కోట్లు వసలయ్యాయి. తక్కినవి పెండింగులోనున్నాయి. ఇంకా రూ.17.1 కోట్లు వసూలవ్వాల్సి ఉంది. ఇందులో బకాయిగా వసూలవని దానిలో అత్యధికం వసూలై కొద్ది మంది నేతల జేబుల్లోకి చేరిందన్న ఆరోపణలున్నాయి.

కొంత సొమ్ము బ్యాంకు ఖాతాల్లోనే

ఆస్తి పన్నుగా వసూలైన డబ్బులను ప్రత్యేకంగా హెచ్‌డిఎఫ్‌సి ఖాతాల్లో జమ చేయాలని గతంలో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ రకంగా డబ్బులు ఆయా ఖాతాల్లో జమ చేశారు. దాని తరువాత ప్రభుత్వ ఖాతాకు మార్చాల్సి ఉంటుంది. అది చేయకుండా ఆ ఖాతాల్లో డబ్బులు ఉండిపోయినట్టు సమాచారం. ఈ రకంగా రావాల్సిన డబ్బులను సొంత జేబుల్లోకి మార్చి కొంత, మరికొంత బ్యాంకు ఖాతాల్లో

నిరర్ధకంగా ఉండపోయినట్టు సమాచారం. ఒకవైపు గ్రామాల్లో అభివృద్ధి కుంటుబడింది. కనీసం మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచే అవకాశం లేకుండా ఉంది. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న సమయంలో వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన పారిశుధ్య పనులు కూడా చేపట్టిన దాఖలాల్లేవు. ఇలాంటి సమయంలో వసూలైన పన్నులు కూడా పక్కదారి పడుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతన్నాయి.

భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ జగదీష్

దులీప్ ట్రోఫీ నిర్వహణకు పటిష్ట భద్రత

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్డీటీ అనంత క్రీడా మైదానంలో జరగనున్న "దులీప్ ట్రోఫీ" నిర్వహణ కోసం చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పి.జగదీష్ బుధవారం పరిశీలించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ చర్చించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ టోర్నీలో ఎలాంటి భద్రతాపరమైన లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్పీతో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, రాప్తాడు సిఐ శ్రీహర్ష, దులీప్ ట్రోఫీ కార్యనిర్వాహక కార్యదర్శి షాబుద్దీన్, ఆర్డీటీ డైరెక్టర్ సాయికృష్ణ, ఎసిఎ వెన్యూ మేనేజర్ ఆదిత్య వర్మ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

14వ బెటాలియన్ కమాండెంట్‌గా కె.ప్రభుకుమార్

బాధ్యతలు స్వీకరిస్తున్న కె.ప్రభుకుమార్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని జంతలూరు దగ్గర ఉన్న 14వ పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా కె.ప్రభు కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ప్రభుకుమార్ ఉద్యోగోన్నతిపై 14వ బెటాలియన్ కమాండెంట్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు.

సిఐగా శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం సిఐగా శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా శింగనమల నుంచి ఈయన బుక్కరాయసముద్రంకు వచ్చారు. శాంతిభద్రల పరిరక్షణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ శ్రీధర్

జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం పరిశీలన

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కార్యాలయంకు వచ్చిన ఆమెకు ఇన్‌ఛార్జి పరిపాలన అధికారి ఎస్.బాలాజీ నాయక్, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్ నాయక్, వెంకట్ కుమార్‌లు పుష్పగుచ్ఛం అందజేశారు. వ్యవసాయ కార్యాలయంలో ఉన్న వివిధ విభాగాల గురించి సీనియర్ సాంకేతిక వ్యవసాయ అధికారి వెంకటకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందిస్తున్న పథకాలు గురించి సాంకేతిక వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్స్ కృష్ణయ్య, రాజగోపాల్, సిబ్బంది ప్రాణేష్, నాగభూషణం, హఫీజ్ పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

గుంతకల్లు స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికపై రగడ

- పారని టిడిపి ఎత్తుగడ
- గందరగోళం నడుమ వాయిదా
- ఎమ్మెల్యే సోదరుడు వచ్చినా ఫలించని వ్యూహం

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు పురపాలక సంఘం స్టాండింగ్ కౌన్సిల్ న్యాయసలహాదారు నియామక ఎన్నిక సమావేశం రసాబాసగా కొనసాగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఈ సమావేశంలో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గత ప్రభుత్వం హయాంలో స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ సలహాదారుగా కొనసాగిన జిపి.తిమ్మారెడ్డి రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించారు. కౌన్సిల్‌లో వైసీపీ సభ్యుల మెజార్టీ ఉంది. 37 స్థానాలు ఉన్న కౌన్సిల్‌లో టిడిపికి ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ఇటీవల 11 మంది వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. దీంతో టిడిపి బలం 18కి పెరిగింది. వైసిపికి 18 స్థానాలు ఉన్నాయి. ఈ సమయంలో సిపిఐకి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి ఓటు కీలకం అయింది. వైసిపికి చెందిన కో ఆప్షన్ సభ్యుడు రాజశేఖర్ తమ పార్టీ నుంచి స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ సలహాదారుగా న్యాయవాది గోపాలకృష్ణ పేరును ప్రతిపాదించారు. ఓటు హక్కు లేని కో ఆప్షన్ సభ్యుడు పేరు ప్రతిపాదన చేయడం సరైంది కాదని టిడిపి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. ఈ సమయంలో ఇరు పార్టీల కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇటీవల వైసీపీ నుంచి టిడిపిలో చేరిన కౌన్సిలర్ నాగరత్న అనారోగ్యంతో పైభవనంలో ఉన్న కౌన్సిల్ సమావేశానికి రాలేక కిందనే కూర్చున్నారు. సభ్యుల వాదనల నడుమ ఎన్నికను ప్రక్రియను కమిషనర్ వెంకట రమణయ్య నిర్వహించలేకపోయారు. ఇదే సమయంలో వైసీపీ కో ఆప్షన్ సభ్యుడు రాజశేఖర్, వైసీపీ నుంచి టిడిపిలోకి వెళ్లిన కౌన్సిలర్ సుధాకర్ ఇతర కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరడంతో ఛైర్‌పర్సన్ భవాని సమావేశాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. ఛైర్‌పర్సన్ సభ నుంచి వెళ్లిపోవడంపై టిడిపి సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి తన అనుచరగణంతో మున్సిపల్ సమావేశంలోకి వచ్చారు. స్టాండింగ్ కౌన్సిల్ న్యాయ సలహాదారుని ఎన్నిక జరపకుండా ఎలా వెళతారని కమిషనర్‌ను నిలదీశారు. ఛైర్‌పర్సన్ లేకుండా ఎన్నిక ప్రక్రియ జరపడం తన పరిధి కాదని కమిషనర్ చెప్పడంతో ఎమ్మెల్యే సోదరుడు గంట పాటు ఉన్నతాధికారులతో చరవాని ద్వారా చర్చలు జరిపారు. ఛైర్‌పర్సన్ లేకుండా ఎన్నిక జరపడం కుదరదని ఉన్నతాధికారులు సైతం చెప్పడంతో చేసేది లేక ఎమ్మెల్యే సోదరుడు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో కౌన్సిల్ స్టాండింగ్ సభ్యుని ఎన్నిక జరగకుండానే వాయిదా పడింది.

సమావేశంలో వాదించుకుంటున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

బోధనలో విజ్ఞానానికి సాంకేతికతను జోడించాలి

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

అధ్యాపకులు తమకున్న విజ్ఞానానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. బుధవారం నాడు మెకానికల్ విభాగం సెమినార్ హాల్లో అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఇ.చెన్నారెడ్డి అధ్యక్షతన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెకానికల్ విభాగాధిపతి డా॥ కె. కళ్యాణి రాధా, డా॥ బి.ఓం ప్రకాశ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఈబి సంయుక్తంగా రెండు రోజులు పాటు ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు వారికున్న విజ్ఞానాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా విద్యార్థులకు బోధించేందుకు ఉపయోగపడతాయన్నారు. రాబోయే కాలంలో కొత్త కోర్సులు, విద్యార్థులకు సులభంగా భోధించే విధంగా అధ్యాపకులకు మరికొన్ని ఫ్యాకల్టి డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, సీనియర్ ఆచార్యులు కె.హేమచంద్రా రెడ్డి, ఎఫ్‌డిపి డైరెక్టర్ జి.ప్రశాంతి, బి.దుర్గా ప్రసాద్, నాగ ప్రసాద్ నాయుడు, బి.చంద్ర మోహన్ రెడ్డి, ఎపి.శివ కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు

యువపారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

స్టూడెంట్ క్లబ్స్ ప్రారంభోత్సవంలో ఇన్‌ఛార్జి విసి

విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసించి ఉద్యోగ అన్వేషణ కోసం కాకుండా యువ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అడుగులు ముందుకేయాలని ఇన్‌ఛార్జి విసి సుదర్శన్ రావు సూచించారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో స్టూడెంట్ క్లబ్స్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ చెన్నారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జి విసి ముఖ్య అతిథిగా హాజరై దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని బహుళ నైపుణ్యాలు వెలికి తీసేందుకు స్టూడెంట్స్ క్లబ్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. నాయకత్వ నైపుణ్యాలు, టీమ్ బిల్డింగ్, మల్టీ టాస్కింగ్, ఆర్గనైజేషన్ నైపుణ్యాలను పెంపొందించడానికి దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా॥ఆర్.మంజుల, స్టూడెంట్ క్లబ్ కోఆర్డినేటర్ డి.మహేష్ నాయుడు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-1లో ఎయిడ్స్ నియంత్రణపై అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఎయిడ్స్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజమణి, అంగన్వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ఉమాదేవి, ఈశ్వరమ్మ, రుక్మిణీదేవి, శివ పార్వతి, హైమవతి పాల్గొన్నారు.

నేడు యల్లనూరుకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి-యల్లనూరు

శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం నాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి రానున్నరు. ఐసిడిఎస్ పరిధిలో నిర్వహించనున్న సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఐసిడిఎస్ సూపర్ వైజర్ రాజమణి తెలిపారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

1వ తేదీ ఉదయం 6గంటలకే పంపిణీ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సెప్టెంబర్ 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లను లబ్ధిదారులకు అందించాలని, ఇందులో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్ల పంపిణీపై డీఆర్డీఏ పీడీ, డీపీవో, ఆర్డీవోలు, ఎల్‌డిఎం, బ్యాంక్ అధికారులు, ఎంపీడీవోలు, ఎపిఎంలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీని ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలన్నారు. గత నెలలో ఆరు గంటలకు మొదలు కావాల్సిన పింఛన్ల పంపిణీ కొన్ని ప్రాంతాల్లో 9 గంటలకు, మరికొన్ని చోట్ల 10 గంటలకు మొదలు అయ్యిందన్నారు. ఈసారి అలా కాకుండా ప్రతి ఒక్కరూ 6 గంటలకే పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు కంట్రోల్ రూమ్ నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. 1వ తేదీన వంద శాతం పింఛన్ల పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిపిఒ ప్రభాకర్ రావు, డీఆర్డీఏ పీడీ ఓబుళమ్మ పాల్గొన్నారు.

కలెక్టర్ వినోద్‌కుమార్

జెఎన్‌టియు పిఆర్ఒ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఓంప్రకాష్

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన రావు ఆదేశాల మేరకు జెఎన్‌టియు పిఆర్ఒగా డా॥బి.ఓం ప్రకాష్ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి విసి, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని చెప్పారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన పిఆర్ఒకు యూనివర్సిటీ డైరెక్టర్లు, భోధన, భోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

పక్కాగా పంట కోత ప్రయోగాలు : ఎడిఎ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పంటలకు పక్కాగా పంటకోత ప్రయోగాలు చేయాలని వ్యవసాయ శాఖ అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. బుధవారం ఆయన రైతుసేవ కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. అన్ని వివరాలతో సమగ్రంగా పంటకోత ప్రయోగాలు చేస్తేనే బీమా అందే అవకాశం ఉంటుందన్నారు. కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల గణాంక అధికారి పోతిరెడ్డి, వ్యవసాయాధికారి శ్యాంసుందర్, ఎఇఒలు పవన్, జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

నగరంలో రక్షణగోడలకు నిధులివ్వండి

మంత్రులను కోరిన ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

అనంతపురం నడిమి వంక, మరువ వంకల రక్షణ గోడల నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. బుధవారం నాడు విజయవాడ క్యాంపు కార్యాలయంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో కలిసి ఈ అంశంపై మంత్రితో చర్చించారు. అనంతపురం నగరంతో పాటు రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో మరువ వంక, నడిమి వంకలకు పెద్ద ఎత్తున నీరు వస్తోందన్నారు. దీని వలన వరదనీరు కాలనీల్లోకి చొచ్చుకెళ్లి చాలా ఇళ్లు నీట మునుగుతున్నాయన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉందన్నారు. ఇందు కోసం రూ.124.02 కోట్లు అవసరం అవుతాయన్నారు. ఈ నిధులను మంజపరు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. నిధులు విడుదలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఎస్‌వి కళాశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు

అనంతపురం : నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జ్ఞాపకార్థం జాతీయ క్రీడలను బుధవారం ప్రారంభించారు. కళాశాల వైస్ ఛైర్మన్ సి. చక్రధర రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. జిల్లా క్రీడా అధికారి ఎస్‌కె.షఫీ విద్యార్థులకు చెస్, వాలీబాల్, త్రోబాల్, హాకీ, పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎస్‌వి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డా॥టి.శ్రీనివాసులు, ఏవో శ్రీనాథ్, ఫీజికల్ డైరెక్టర్ కొండా రెడ్డి, ఎం.శ్రీనివాసులు నాయక్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య పెద్దఎత్తున చేరిన నీరు

ఇళ్ల చుట్టూ నీరు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఇటీవల కురిసిన వర్షాలకు అనంతపురం రూరల్ పరిధిలోని రుద్రంపేట, వికలాంగుల కాలనీ, తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వర్షం నీటికి మురుగు నీరు తోడవటంతో దుర్గంధం వెదజల్లుతుందని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు దోమలు వృద్ధి చెంది చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని పేర్కొంటున్నారు. వికలాంగుల కాలనీలో ఓ ప్రయివేటు స్కూల్ ముందే నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు రోగాల బారినపడే ఆస్కారం ఉందని వాపోతున్నారు. ఆయా కాలనీల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ భవానికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

'రైల్వే' అడ్డు గోడల తొలగింపునకు తీర్మానం చేయాలి

గుంతకల్లు : రైల్వే ప్రాంతంలోకి ప్రవేశించకుండా రహదారిపై అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరుతూ బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానికి వినతి పత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వే ప్రాంతంలోకి వెళ్లకుండా రైల్వే అధికారులు రహదారులు మూసివేశారన్నారు. వీటిని తొలగిస్తే విద్యార్థులు, ఉద్యోగులు, రైల్వే కాలనీ, సామాన్య ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై తీర్మానం చేసి రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యు లు షబ్బీర్, రామునాయక్, తిమ్మప్ప, అబ్దుల్లా, ఓబులేసు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

శింగనమల : పంటల సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో అన్వేష్ కుమార్ తెలిపారు. మండలం లోని అట్టే వీరనారప్ప వేరుశనగ పొలంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ వేరుశనగ పంట సాగు చేసే ప్రతి రైతు పొలం చుట్టూ జొన్న లేక సజ్జ పంట వేసుకోవాలన్నారు. వాటితో పాటు ఆరు సార్లకు ఒకసారి మధ్య మధ్యలో రెడ్డి గ్రామ్ పంట ఆముదం లేక కంది పంట వేసుకోవడం వల్ల వేరుశనగ పంటకు తెగులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గి పంట దిగబడి శాతం తగ్గుతుందని, తద్వారా రైతులు నష్టపోతారన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటను ఉన్నతాధికారులు పరిశీలించి కొనుగోలు చేస్తారని తెలిపారు. వేరుశనగ పంటలో తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిఇఒలు రాజారెడ్డి, అక్కమ్మ, రైతులు తిరుపతయ్యనాయుడు, సంపత్‌కుమార్, అట్టే వీరనారప్ప, అంజప్ప, రాధమ్మ, రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లుకు నామపత్రాలు అందజేస్తున్న వైసిపి కార్పొరేటర్లు

స్టాండింగ్ కమిటీ స్థానాలకు నామినేషన్

అనంతపురం కార్పొరేషన్ : నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ స్థానాలకు ఐదుగురు వైసిపి కార్పొరేటర్లు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఎన్నికల అధికారి అయిన డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వైసిపి కార్పొరేటర్లు ఐదు స్థానాలకు ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. మేయర్ మహమ్మద్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్ రెడ్డితో కలిసి వైసిపి కార్పొరేటర్లు నరసింహులు, సుజాత, అనిల్‌కుమార్‌రెడ్డి, నాగ వినీత, రహంతుల్లా నామినేషన్లు దాఖలు వేశారు. కార్యక్ర మంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, లాలూ, అబూ సాలెహ్, శ్రీనివాసులు, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. దీంతో పోటీ లేకుండానే 5 స్టాండింగ్ కమిటీ స్థానాలకు ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వత్తి విద్య కోర్సుకు సంబంధించి అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని, ఆ పోస్టుకు ఎం కామ్ టాక్సేషన్ పూర్తి చేసిన వారు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.వీరేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిహెచ్‌డి(డాక్టరేట్) చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సెప్టెంబర్ 2వ తేదీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించం

ప్రజాశక్తి-పామిడి

బకాయి వేతనాల కోసం పట్టణ సమీపంలోని పెన్నా నది పంప్ హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు చేపట్టిన సమ్మె ఏడో రోజైన సోమవారం కూడా కొనసాగింది. కార్మికులు విధులు బహిష్కరించి పంప్ హౌస్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 28 ఏళ్లుగా ప్రజల దాహార్తి తీరుస్తున్న తాగునీటి పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. 1996 నుంచి 2020 వరకూ నెలకు రూ. 2.4 కోట్లు ఉన్న బడ్జెట్‌ను 2024లో నెలకు రూ. 80 లక్షలకు కుదించడం ఏంటని ప్రశ్నించారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో కాంట్రాక్టర్లు ముందుకు రాక వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో తాగునీటి సరఫరాను నిలిపి వేసి నిరసన తెలుపుతున్నామన్నారు. 500 మందికి పైబడి కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు అందక కుటుంబం పోషణ భారమైందన్నారు. ఇకనైనా పాలకులు స్పందించి బకాయి వేతనాలు మంజూరు చేయాలని, సత్యసాయి పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు కృష్ణమూర్తి ఆచారి, బాషా, నాగభూషణం, రాజు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

'సత్యసాయి' కార్మికుల హెచ్చరిక

శిబిరంలో నినాదాలు చేస్తున్న 'సత్యసాయి' కార్మికులు

నార్పల : బకాయి వేతనాల కోసం సత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు మండలం లోని బి.పప్పూరు పంప్ హౌస్ వద్ద ఏడో రోజూ నిరసనను కొనసాగించారు. వారు మాట్లాడుతూ 6 నెలలుగా వేతనాలు అందకపోయినా పని చేశామని, విధి లేని పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా బోర్డు అధికారులు స్పందించకపోవడం దుర్మార్గం అన్నారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లనాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

1న పించను పంపిణీలో పాల్గొనండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

సెప్టెంబర్ 1వ తేదీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి నాయకులు అధికా రులతో కలిసి పాల్గొనాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యే బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన జాతరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సమస్యలపై నాయకులతో చర్చించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే గ్రామంలో ఎంత మంది నిరుద్యోగ యువత ఉన్నారని తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం తాను నిరంతరం కష్టపడ తానని హామీ ఇచ్చారు. జాతర సందర్భంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సర్పంచి సందీప్ ఇంట్లో విందు భోజనం చేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల పార్టీ కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు, నాయకులు ధర్మతేజ, వెంకటేశులు, జితేంద్రగౌడ, మోరేపల్లి మల్లికార్జున, అమిలినేని లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం టిడిపి మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు, డిష్ మురళి, బుజ్జి, పాలవెంకటాపురం సురేంద్ర, వన్నూరుస్వామి, లాల్‌కృష్ణ, పవన్, తిమ్మప్ప, కేశవరెడ్డి, రాము, చెన్నప్ప, లక్ష్మన్న ఉన్నారు.

జాతర సందర్భంగా సర్పంచి సందీప్ ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు, నాయకులు

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టాపన

కుందుర్పి : స్థానిక దళిత కాలనీలో వెలసిన ఆలయంలో మూడు రోజులుగా వేద పండితులు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలశం, హోమం, విగ్రహ ప్రతిష్ట, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బుధవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గత రెండు రోజులు హనుమంత రాయుడు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వెంట సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి, ఎమ్మెల్యే అల్లుడు ధర్మతేజ, మోరేపల్లి మల్లికార్జున, టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ, నాయకులు రనాఘవేంద్రబాబు, తిప్పేస్వామి, మల్లికార్జున, రామ్మూర్తి నాయుడు, ఆనంద్ ఉన్నారు.

అంగన్వాడీ సెంటర్లను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-పామిడి

అంగన్వాడీ సెంటర్లను సక్రమంగా నిర్వహించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సిడిపిఒ మల్లేశ్వరి తెలిపారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన్‌లో బుధవారం గుత్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఇందులో పామిడి సెక్టార్‌లోని 28 అంగన్వాడీ సెంటర్లు, ఎద్దులపల్లి సెక్టార్‌లోని 29 అంగన్వాడీ సెంటర్లకు సంబంధించి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు విధిగా రికార్డులను నమోదు చేయడం, పిల్లల హాజరు శాతం, బరువులు వంటి అంశాలతో పాటు ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విధులు నిర్వర్తిస్తూ సెంటర్ లోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రామలక్ష్మి, లక్ష్మీనారాయణమ్మ, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఆహారం అత్యవసరం : సిడిపిఒ

శింగనమల : శిశువు ఎదుగుదలకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అత్యవసరమని సిడిపిఒ ఉమాశంకరమ్మ తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం సిడిపిఒ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ వర్కర్లకు బిడ్డ వెయ్యి రోజుల సంరక్షణపై సమావేశం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణిగా ఉన్న సమయంలో పౌష్టికారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణకు ఐరన్ మాత్రలు, డెలివరీ తర్వాత గంట లోపే శిశువుకు తల్లిపాలు తాపించాలన్నారు. బిడ్డ ఎదుగుదల కోసం 6 నెలల తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం తప్పనిసరి అన్నారు. అలాగే పరిశుభ్రత, అంటువ్యాధులు, బాల్యవివాహాల గురించి వివరించారు. ప్రతి సెంటర్‌లో వెయ్యి రోజుల సంరక్షణ గురించి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబర్‌లో జరిగే పోషకాహార మాసోత్సవం గురించి తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు కౌసల్య, ధనలక్ష్మి, ఉమాదేవి, వాణిశ్రీ, నాగమణి,హేమావతి, అన్నపూర్ణాదేవి, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరులో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శాంతమ్మ

పుట్లూరు : పుట్లూరు సెక్టార్‌లోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంతమ్మ, ఎఎన్ఎం ఐశ్వర్య, ఆశా వర్కర్, అంగన్వాడీ వర్కర్, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే సునీత

కలెక్టర్‌కు పూలబొకే అందిస్తున్న ఎమ్మెల్యే సునీత

అనంతపురం కలెక్టరేట్ : కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం కలిశారు. రాప్తాడు నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. టమోటా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. టమోటా ధరలు హెచ్చు తగ్గులు ఉండటం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సాహో వంటి రకాల విత్తనాన్ని సబ్సిడీపై అందించాలన్నారు. స్టేకింగ్ పద్ధతిలో టమోటా సాగు చేసేందుకు రాయితీలు ఇవ్వాలన్నారు. మల్చింగ్ షీట్‌పై రాయితీలు పెంచాలన్నారు. రేషన్ డీలర్లకు సంబంధించి బఫర్‌ని జీరో చేసి బియ్యాన్ని డీలర్లకు ఇవ్వాలన్నారు. గతం ప్రభుత్వంలో జరిగిన రేషన్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాప్తాడు సమీపంలో పరిశ్రమలు నెలకొల్పేలా చొరవ చూపాలన్నారు. అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో తాగునీటి పథకం పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. వీటికి సంబంధించిన బిల్లులు త్వరితగతిన చెల్లించి, పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక ఎస్పీ జగదీష్‌ను కలిసిన సందర్భంలో నియోజకవర్గంలో శాంతి భద్రతలు, ఇతర వాటి గురించి చర్చించారు. గతంలో నమోదు చేసిన అక్రమ కేసులు, పోలీసుల ద్వారా ఇబ్బంది పెట్టిన అంశాలను సునీత ఎస్పీకి వివరించారు.



ప్రత్యేకంగా అలంకరించిన దర్గా

ఘనంగా జైనబ్బీ ఉరుసు

ఉరవకొండ : ప్రసిద్ధిగాంచిన పట్టణంలోని హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక అల్లప్పరెడ్డి ఇంటి నుంచి గంధంను ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాల హంస వాహనంలో ఉంచి మెయిన్ బజార్ గుండా రబ్బాని బ్యాండ్ మేళతాళాల మధ్య బాణసంచా పేలుస్తూ హుస్సేన్‌పీరా ఇంటి మీదుగా పట్టణ పురవీధుల్లో ఊరేగించి దర్గాకు చేర్చి అమ్మవారి జీవ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధం వేడుకలను తిలకించడానికి జిల్లా నుంచే కాకుండా కర్నాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా, షాకీర్, జెండా జిలాన్, ప్రసాద్, పామిడి జాకీర్, శర్మాస్‌వలి, బళ్లారి సాధిక్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణం తనిఖీ

అనంతపురం : విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జె.వాసుప్రకాష్, వ్యవసాయ అధికారి పి.ఫణింద్రనాథ్‌రెడ్డి, ఎస్ఐ, సిబ్బంది కలిసి నగరంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఆగ్రో ట్రేడర్స్(పెస్టిసైడ్స్)షాపును తనిఖీ చేశారు. అధికారులు మాట్లాడుతూ నకిలీ, నిషేధిత, కాలం చెల్లిన పురుగు మందులు అమ్మినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

నేడు ఎస్ఎంసి ఎన్నికలు

నార్పల : స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో గురువారం(నేడు) ఎస్ఎంసి ఎన్నికలు నిర్వహిస్తారు. నిబంధనల మేరకు పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఉండాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సాగర్ హెచ్చరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

గుత్తి : పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్, కోశాధికారి లక్ష్మీప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక శ్రీసాయి జూనియర్ కళాశాలలో బుధవారం ఎఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు కిరణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, బాలికల జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మధ్యాహ్న భోజనం అందించాన్నారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ధనుష్, విజయకుమార్, కోశాధికారిగా బాబులను ఎన్నుకున్నారు.

ఆదమరిస్తే అంతే..

పొబ్బర్లపల్లి-చెల్లికెర మార్గంలో ప్రమాదకరంగా బావి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పొబ్బర్లపల్లి గ్రామ శివారులో ఓ పాడుబడిన బావి ఉంది. ఈ బావి పక్కనే ఓ పాఠశాల, పొబ్బర్లపల్లి నుంచి చెల్లికెర వెళ్లే అత్యంత రద్దీ కల ప్రధాన రహదారి ఉండడం గమనార్హం. ఈ మార్గంలో నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు, వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఆ బావికి ఏర్పాటు చేసిన రక్షణ గోడ కొన్నేళ్ల క్రితమే కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, విద్యార్థులు ఏ మాత్రం ఆదమరిచినా బావిలోకి దూసుకుపోయే ప్రమా దం ఉంది. ఈ విషయాన్ని గత ప్రభుత్వంలో గ్రామస్తులు అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ దృష్టికి తీసు కెళ్లినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అయినా తక్షణమే స్పందించి పాడుబడిన బావికి ప్రధాన రహదారి వైపు రక్షణ గోడ ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొబ్బర్లపల్లి-చెల్లికెర ప్రధాన రహదారి పక్కన ఉన్న బావి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పూలబొకే అందజేస్తున్న కమిషనర్

దుర్గం మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్ రెడ్డి

రాయదుర్గం : మున్సిపల్ కమిషనర్‌గా వి.దివాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్పను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. గూడూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈయన గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఎన్నికల ముందు బదిలీపై నగరి మున్సిపాలిటీకి వెళ్లారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఇద్దరు మృతి

పెద్దపప్పూరు : మండలంలోని చీమల వాగుపల్లి గ్రామ సమీపంలో రైల్వే స్టేషన్ పక్కన బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. యాడికి పట్టణంలోని నారాయణ స్వామి కాలనీకి చెందిన వడ్డే శ్రీనివాసులు(33), నార్పల మండలంలోని నాయనపల్లికి చెందిన వడ్డే రాజేష్(30) ఇద్దరూ బావబామ్మర్దులు. వీరు ఓ పని నిమిత్తం ఉదయం ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి యాడికికి బయల్దేరారు. మార్గమధ్యలో చీమల వాగుపల్లి సమీపంలో రైల్వేస్టేషన్ పక్కన గుర్తు తెలియని ఓ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. శ్రీనివాసులుకు భార్య అనూష, మూడు నెలల కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

తాడిపత్రి రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం తాడిపత్రి రూరల్ పరిధిలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బోడైపల్లి గ్రామానికి చెందిన వివేకానంద(18) పట్టణంలో భవన నిర్మాణ కార్మికునిగా పని చేసుకుం టూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారి పనిలో భాగంగా స్వగ్రామం నుంచి స్కూటీపై తాడిపత్రికి వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొనడంతో వివేకానంద అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో తండ్రిని కడతేర్చిన కొడుకు

బెళుగుప్ప : కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రినే తనయుడు కడతేర్చి సంఘటన మండలంలోని యలగలవంక తండాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాలు.. తండాకు చెందిన తిప్పే నాయక్(53) తాగుడుకు బానిసై నిత్యం భార్య లక్ష్మీబాయి, కొడుకు రాజశేఖర్ నాయక్‌తో గొడవ పడేవాడు. మంగళవారం యలగలవంకలో మారెమ్మ జాతర నిర్వహించారు. తిప్పేనాయక్ అతిగా తాగి రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి మద్యం మత్తులో భార్య, కొడుకుతో గొడవపడ్డాడు. అప్పు చేసి మద్యం తాగడం ఎందుకని కొడుకు నిలదీశాడు. దీంతో వాగ్వాదం చేసు చేసుకుంది. మాటా మాటా పెరిగి క్షణికావేశంలో తల్లి కొడుకు అతడిపై దాడి చేయడంతో తిప్పేనాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం ఎస్ఐ పోలీసులతో కలిసి సంఘ టనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిప్పేనాయక్ కూతురు జ్యోతి బాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం : మండలంలోని పాతచెరువు గ్రామ సమీపంలో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సిబాయి గ్రామానికి చెందిన నాగేంద్ర(మాజీ ఫీల్డ్ అసిస్టెంట్), శెట్టూరు మండలంలోని అనుంపల్లి గ్రామానికి చెందిన మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా 40 నిమిషాల తర్వాత 108 సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రి తరలించారు. కాగా సమాచారం ఇచ్చాక 40నిమిషాల తర్వాత రావడంతో 108సిబ్బందపై స్థానికులు, బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

గుత్తి : పట్టణంలోని దాసరికాలనీలో బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. అమరవీరులు కామ్రేడ్ రామకృష్ణ, కామ్రేడ్ బాలస్వామి, కామ్రేడ్ విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలు ఉంచి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, కవిత, సిఐటియు నాయకులు శ్యామల పాల్గొన్నారు.

అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఎమ్మెల్యే కాలవకు అర్చకుల సన్మానం

రాయదుర్గం : రాష్ట్రంలో అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి పట్ల ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు వైపి. ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డిపల్లి రాజేష్ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని మెచ్చిరి గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుల సమస్యను పరిష్కరించి నందుకు బుధవారం వారు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య కమిటీ సభ్యులు ఆనంద్, మెచ్చిరి హనుమంత రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న అర్చకులు

అన్ని గ్రామాల్లోనూ పంటకోత ప్రయోగాలు

ఉరవకొండ : స్థానిక రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏవో శుభకర్ పంట కోత ప్రయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలనే అంశంపై పూర్తి స్థాయిలో అవగా హన కల్పించారు. ఈ క్రాప్ నమోదుపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. రైతులు సంబంధి రైతు సేవా కేంద్రంలో పంటను నమోదు చేసుకుని ఈకేవైసీ చేయిం చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

నార్పల : మండలంలోని దుర్గం గ్రామంలో దోమల నివారణపై బుధవారం సర్పంచి సాకే రామాంజనేయులు, డాక్టర్ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉన్నచోట దోమల మందు పిచికారి చేయించారు. అంగన్వాడీ, ఎంపిపి స్కూళ్లకు వెళ్లి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి, ఆరో గ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ మహేంద్రనాథ్ దోమల నివారణ చర్యల ను వివరించారు. ఆర్‌డిటి పాఠశాలలో 104 వైద్య శిబిరం నిర్వహించి గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శివకుమార్, ఎఎన్ఎం ఫరీదాబాను, అమృతాంజ లి, ఆశావర్కర్ వీరనారాయణమ్మ, క్లాప్ మిత్ర సోమశేఖర్, 104 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'అభయ ఘోష' ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

అనంతపురం : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన 'అభయ ఘోష' ప్రత్యేక సంచికను బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, ప్రజారోగ్య వేదిక కార్యదర్శి శ్రీనివాసరావు, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కరెస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న దుర్ఘటనలపై ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించడం సంతోషకరంగా ఉందని, ప్రజా చైతన్యం కోసం ప్రజాశక్తి చేసున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ప్రజాశక్తి సిబ్బంది రవిచంద్ర, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

'అభయ ఘోష' ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ప్రముఖులు